క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. లలితా జ్యువెలరీ, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు నిర్వహించిన జాబ్‌మేళాకు 153 మంది హాజరుకాగా, 71 మందికి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జింకల కోసం విద్యుత్ కంచెలు

వెంకటాచలం: తిక్కవరప్పాడు – సర్వేపల్లి మధ్య గల అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలను అక్రమంగా ఏర్పాటు చేసి జింకలు, పందులను వేటాడుతున్నారనే అంశం శనివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిక్కవరప్పాడు – సర్వేపల్లి మధ్య గల అటవీ ప్రాంతంలో జింకలు, అడవి పందులను వేటాడేందుకు గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు సమీపంలోని మెయిన్‌లైన్‌కు విద్యుత్ కనెక్షన్లను అక్రమంగా ఇచ్చారు. విషయాన్ని గుర్తించిన సర్వేపల్లి గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల రాకతో గుర్తుతెలియని వ్యక్తులు ఓ బైక్‌ను వదిలి పరారయ్యారు. బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇచ్చిన వ్యక్తులపై ఆరా తీస్తున్నారు.

యాళి వాహనంపై కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో కొలువైన కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు యాళి వాహనంపై శనివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. ఆలయ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరుకు అదనపు పీహెచ్‌సీ మంజూరు

పొదలకూరు: మండలానికి అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. మండలానికి మరో పీహెచ్‌సీ (కో – లొకేటెడ్) మంజూరు చేయడంతో పాటు డాక్టర్లుగా కిరణ్‌రిషిత, శ్రీకావ్యను నియమించారని చెప్పారు. తాత్కాలికంగా పొదలకూరు సీహెచ్‌సీలో అదనపు కేంద్రాన్ని నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం పీహెచ్‌సీని ఎక్కడ ఏర్పాటు చేసే అంశంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు. అదనపు పీహెచ్‌సీకి భవిష్యత్తులో నూతన భవనం, సిబ్బంది యథావిధిగా ఉంటారని తెలిపారు.

మహిళా పోలీసులతో సమీక్ష

కోవూరు: నేర నియంత్రణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలు చెడు వ్యసనాలకు బానిసవ పడకుండా చర్యలు చేపట్టాలని ఎస్‌ఈబీ సీఐ నరహరి కోరారు. విడవలూరు మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ మద్యం, గంజాయి, తదితరాలపై నిఘా ఉంచాలని కోరారు. బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులను అరికట్టాలని సూచించారు.

6న వాహనాల వేలం

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని ఎస్‌ఈబీ సీఐ నరహరి పేర్కొన్నారు. కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద మూడు బైక్‌లను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. పాల్గొనాలనుకునే వారు కార్యాలయాన్ని సంప్రదించి ధరావతును చెల్లించాలని కోరారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

వెంకటాచలం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ నాగరాజు ఆదేశించారు. మండలంలోని కసుమూరు, చవటపాళెం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన జగనన్న కాలనీలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కసుమూరులోని మూడు లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన మెటీరియల్‌తో పాటు బిల్లులను ప్రభుత్వం సత్వరమే మంజూరు చేస్తోందనే అంశాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని కోరారు. చవటపాళెంలో కొత్తగా నిర్మించనున్న లేఅవుట్లలో లబ్ధిదారుల జాబితాను గృహ నిర్మాణ శాఖ అధికారులకు రెండో రోజుల్లో అందజేయాలని తహసీల్దార్ కృష్ణకు సూచించారు.

నాటు సారా తయారు చేస్తే చర్యలు

మనుబోలు: నాటు సారాను తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని నెల్లూరు రెండో పట్టణ ఎస్‌ఈబీ ఎస్సై శకుంతలాదేవి హెచ్చరించారు. ఎస్‌ఈబీ జేడీ హైమావతి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మద్యాన్ని అక్రమంగా విక్రయించినా.. బెల్టుషాపులను నిర్వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వైద్య రంగానికి పెద్దపీట

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 34వ డివిజన్లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కేంద్రాలు పేదలకు ఎంతో ఉపయోపడతాయని చెప్పారు. నియోజకవర్గంలో ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయని, ఇందులో నాలుగు భవనాలు పూర్తికాగా, మిగిలినవి త్వరలో పూర్తి కానున్నాయని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలను అందించాలని కోరారు. అనంతరం భవన ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కమిషనర్ హరిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

రూరల్ పరిధిలోని 19వ డివిజన్లో రూ.32 లక్షలతో నిర్మించనున్న డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేపట్టారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



నెల్లూరు రూరల్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఆయా ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కందమూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎంపీ.. జెడ్పీ నిధులను రూరల్ ప్రాంత అభివృద్ధికి అధికంగా కేటాయిస్తామని తెలిపారు. ములుమూడి నుంచి కందమూరు క్రాస్‌రోడ్డు వరకు రహదారి నిర్మాణానికి రూ.ఎనిమిది కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేశామని, పనులను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు.

ముగిసిన దుర్మార్గ పాలన

నియోజకవర్గంలో ఇప్పటి వరకు దుర్మార్గ పాలనను కోటంరెడ్డి సోదరులు సాగించారని, అది ముగిసిందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. కోటంరెడ్డి సోదరులను ప్రజలు నీలదీయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రైల్వే బోర్డు మెంబర్ వెంకయ్య, ప్రభాకర్‌రెడ్డి, నరసింహకొండ దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్, జడ్జి





నెల్లూరు(అర్బన్): నగరానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయిని మినర్వా గ్రాండ్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు.

క్రైమ్ కార్నర్

చీటీల పేరుతో మోసం

నెల్లూరు సిటీ: చీటీల పేరుతో తమను రూ.60 లక్షల మేర మోసం చేశారంటూ నిర్వాహకుడి ఇంటి వద్ద బాధితులు ఆందోళనను శనివారం చేపట్టారు. బాధితుల వివరాల మేరకు.. హరనాథపురంలోని రెండో వీధిలో ఓ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న వ్యక్తి చీటీలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా చీటీలను పాడుకున్నా, నగదు చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో బాధితులు రత్తమ్మ, మురళి, రఘురామయ్య, పద్మిని చీటీల నిర్వాహకులను వారి ఇంటి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎక్కడైనా చెప్పుకోమంటూ బెదిరించారని బాధితులు వాపోయారు. ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు సిటీ: బ్రాహ్మణవీధిలో చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల వివరాల మేరకు.. బ్రాహ్మణవీధిలో నివాసం ఉంటున్న వెంకటఅచ్యుత నారాయణ తన కుటుంబంతో కలిసి పైఅంతస్తులో గత నెల 13వ తేదీ రాత్రి నిద్రించారు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి కిటికీ గ్రిల్స్‌ను తొలగించడంతో పాటు గోడ అంచును పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి చూడగా, కబోర్డులోని డ్రాలో రూ.రెండు లక్షల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నెల్లూరు సిటీ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన హరనాథపురంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఇద్దరు వ్యక్తులు బైక్‌లపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వీరు గాయపడ్డారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

జూదరుడి అరెస్ట్

నెల్లూరు సిటీ: సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడ్ని సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుప్తా పార్కు సెంటర్‌కు చెందిన శ్రీనివాసులురెడ్డి కొంత కాలంగా సింగిల్ నంబర్ లాటరీని నిర్వహిస్తున్నారు. ములుమూడి బస్టాండ్ వద్ద నిర్వహిస్తుండగా, శ్రీనివాసులురెడ్డిని సంతపేట ఎస్సై రాజేష్ అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.7,545ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్: ములుమూడికి చెందిన ఓ జంట నెల్లూరు రూరల్ పరిధిలోని మొగళ్లపాళెం వద్ద శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. ములుమూడికి చెందిన హారిక, ప్రసాద్ గడ్డి మందును తాగారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీరిని స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని నగరంలోని జీజీహెచ్‌కు తరలించారు. కాగా ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మంత్రికి సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ ఉద్యోగులు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. డీసీసీబీ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, బ్యాంక్ ఏజీఎం మధుసూదన్‌రావు, శ్రీనివాసులురెడ్డి, యూనియన్ నేతలు శ్రీహరిబాబు, గౌస్‌బాషా, శివ, వంశీ, గుర్నాథం, కృష్ణయ్య, రాఘవ, రమేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: నగరానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు మానవేంద్రనాథ్‌రాయ్, శేషసాయిని ఎస్పీ విజయారావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు.

బాధితురాలికి న్యాయం చేయాలని వినతి

నెల్లూరు(అర్బన్): మూలాపేట సమీపంలోని ఇరుగాళమ్మ సంఘంలో నివసిస్తూ ఆటోడ్రైవర్ మనోహర్ కారణంగా మోసపోయిన పెంచలమ్మకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని ఐద్వా నేతలు శంషాద్, సులోచన, జాకీరా కోరారు. పెంచలమ్మను ఆమె నివాసంలో పలువురు ఐద్వా నేతలు శనివారం పరామర్శించారు. అనంతరం కార్పొరేటర్ విజయలక్ష్మి వద్దకు తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతూ అర్జీని అందజేశారు.

ఆలయాల్లో విశేష పూజలు



వేణుగోపాలస్వామి దేవస్థానంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో..



త్యాగరాజస్వామి మందిరంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిత్య హోమం, పూలంగిసేవ, శేషవాహనసేవను జరిపారు. ఉభయకర్తలుగా వెంకటకిషోర్‌కుమార్, హేమలత దంపతులు వ్యహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, మస్తాన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

➡ పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక కొతాయి ఉత్సవాల్లో స్వామివారు రాజమన్నార్ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బాలాజీ, రూపాదేవి దంపతులు వ్యవహరించారు. ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధ్వజారోహణ, శేషవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులురెడ్డి కుటుంబసభ్యులు, వెంకటజయచంద్రశర్మ, కామేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమౌళీరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో తిరుమంజనం, ఊంజల్, పల్లకిసేవ, తదితరాలను నిర్వహించారు.

➡ సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి అభిషేకాలు, పూజలు, హంసవాహనసేవను నిర్వహించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

➡ నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పంగున్యుత్తర ఉత్సవాలను ప్రారంభించారు. రంగనాయకి తాయార్లకు తిరుమంజనం, స్థల పురాణ పఠనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

➡ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉభయకర్తలుగా రఘురామిరెడ్డి, భువనేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య ధర్మకర్తల మండలి చైర్మన్ రమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు



మాట్లాడుతున్న అరుణమ్మ

నెల్లూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలోని జెడ్పీ స్కూల్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. నాడు – నేడు పనులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు పూజిత, అఖిలను అభినందించారు. అనంతరం వావిలేటిపాడులోని రెండు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.

ఒత్తిడికి గురికాకుండా విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న విజయారావు

• ఎస్పీ విజయారావు

నెల్లూరు సిటీ: పోలీస్ సిబ్బంది ఒత్తిళ్లకు గురికాకుండా విధులు నిర్వర్తించాలని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ విభాగాలు, డీసీఆర్బీ, ఐటీ కోర్, స్పందన, పీఆర్వో విభాగాల్లో రికార్డులు, పనితీరును శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులకు ఎలాంటి సమస్య ఉన్నా, తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి విభాగంలో ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని, సమయపాలనను తప్పక పాటించాలని చెప్పారు.

మహిళా పోలీసులకు అభినందన

విధులను మహిళా పోలీసులు సమర్థంగా నిర్వహిస్తున్నారని, ఇదే తరహాలో మరింత బాగా పనిచేయాలని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. ఎస్పీ.. అడిషనల్ ఎస్పీ హిమవతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, దిశా యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. తప్పిపోయిన వారి ఆచూకీని కనుగొనడంతో బాగా పనిచేస్తున్నారని అభినందించారు.

చిరు ధాన్యాలతో పౌష్టికాహారం



మాట్లాడుతున్న సౌజన్య

నెల్లూరు(వేదాయపాళెం): చిరు ధాన్యాలతో మంచి పోషక విలువలు అందుతాయని ఐసీడీఎస్ పీడీ సౌజన్య పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ, సెక్టార్ సూపర్ వైజర్ ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. వెంగళరావునగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంల పనితీరు పరిశీలించిన అనంతరం టీకాల రిజిస్టర్‌తో పాటు గర్భిణులకు సంబంధించిన వివరాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా చూడాలని పేర్కొన్నారు.

మల్లయ్య సేవలు స్ఫూర్తిదాయకం



నెల్లూరు(అర్బన్): పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్, సామగ్రిని ఎన్నో ఏళ్లుగా అందిస్తున్న పంచాక్షరి మల్లయ్య సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ సుధాకర్‌రావు పేర్కొన్నారు. దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్ వద్ద ఆయన్ను శనివారం సత్కరించిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. నగరంలోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో చదివే విద్యార్థులకు మెటీరియల్‌ను వైద్యశాఖకు చెందిన హెచ్‌ఈఈఓ ధర్మేంద్ర అందజేశారన్నారు. మానవసేవే మాధవ సేవ టీమ్ నిర్వాహకులు పరిమళ, రాఘవ, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'జెనెక్స్' విజయకేతనం



నెల్లూరు (టౌన్): డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో జెనెక్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు పేర్కొన్నారు. ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని కళాశాలలో శనివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. బీఎస్సీ (ఎమ్మెస్సీఎస్)లో గాయత్రి 9.37, రిషిత 9.34, పావని 9.3, ఎంపీసీఎస్‌లో దీపక్ 9.22, కరిష్మా 9.03, బీకాంలో అర్షియా సుహానా 9.37, తేజస్విని 9.17, శివప్రణతి 9.09 జీపీఏను సాధించారన్నారు. బీసీఏలో సాయికీర్తి 9.2, చెంచులక్ష్మి 9.18, చాతుర్య 9.16, బీబీఏలో ప్రసన్నతేజ 9.08, పద్మజాదేవి 9.05 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): పరీక్షల్లో ప్రతిభ చూపి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నగర పరిధిలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న 1500 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి సన్నిధిలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు సీతారామారావు, కన్యకాపరమేశ్వరి దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మనోహర్, పాండురంగ అన్నదాన సమాజ కార్యదర్శి వైభవ్ వెంకన్న, వాసవీ సేవాదళ్ కోశాధికారి విశ్వనాథం, ఆర్యవైశ్య యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వుల మేరకే రెడ్‌క్రాస్ ఎన్నికలు జరపాలి

నెల్లూరు(బృందావనం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఎన్నికలను రాష్ట్ర హైకోర్టు తీర్పును అనుసరించి నిర్వహించాలని సొసైటీ జీవితకాల సభ్యుడు సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలను నిర్వహించి నెల్లూరు రెడ్‌క్రాస్‌ను జేబు సంస్థగా చేసుకోవాలనుకునే వారికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన తీర్పు ఒక చెంపపెట్టు అని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలను నిర్వహిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. అంకయ్యచౌదరి పాల్గొన్నారు.